# ప్రతభంగం

పట్టుదలకు పర్యాయపదంలాంటిది సాంబయ్యగారి కుటుంబం. ఆ కుటుంబంలోని ప్రతిఒక్కరూ ఒక్కొక్క రకమైన పట్టుదలను లోకులకు ప్రదర్శించారు. ఈ మితిమీరిన పట్టుదలతో వాళ్ళెంత పనికంటే అంత పనికి బరితెగించగలరన్నది లోకులకు రూఢిగా తెలిసిన విషయం.

ముతక మనుషులందరూ మురాకట్టి ఒక చోట చేరినట్టు కనిపించే సాంబయ్యగారి కుటుంబంలో కాస్త మెతక మనసు కలిగినవాడు ఒక్క ప్రకాశం మాత్రమే! కానైతే ప్రకాశంగూడా పట్టుదలలో మిగతావాళ్ళకు తీసిపోయేవాడేమీ కాడు.

నలుగురు మగ బిడ్డలను ఈ లోకంలో దిగవిడిచి భార్య పరలోకం చేరుకున్న తర్వాత సాంబయ్యగారికి మళ్ళీ పెళ్ళి చేసుకోవాలన్న ఉద్దేశం లేకపోయింది. సవతి తల్లి పెంపకం పిల్లలకు సరిపడకపోవచ్చుననిగాదు, అసలు సాంసారిక సుఖాలపట్ల సాంబయ్యగారికి ఆది నుంచీ ధ్యాస తక్కువ. ఆయన ఆలోచనలెప్పుడూ వ్యాపారరంగంలో గిరికీలు కొడుతుండేవి. తనకు ముసలితనంగానీ, చావుగానీ లేదన్నట్టుగా మానవుడు డబ్బు సంపాదించాలన్నారు పెద్దలు. వెంటనే, మృత్యువుచేత బరబరా ఈడ్వబడుతున్నట్టుగా ఆ డబ్బును దానధర్మాలకు వినియోగించాలని కూడా అన్నారనుకోండీ! అంటే అన్నారులెమ్మనుకుని, ఈ సూక్తిలో పూర్వార్థాన్ని మాత్రం కంఠతా పెట్టి, ఒంటబట్టించుకున్నారు సాంబయ్యగారు.

సాంబయ్యగారి కుమారులు నలుగురిలోనూ పెద్దవాడు ప్రకాశం. పువ్వుపుట్టగానే పరిమళమన్నట్టుగా వాడు హైస్కూలుకు వెళ్తున్న రోజుల్లోనే రాత్రుల్లో పది పదకొండు గంటల వరకూ చదువుకునేవాడు. పరీక్షల్లో ఎక్కడలేని మార్కులూ వాడికే వచ్చేవి. తరగతిలో ప్రథముడుగా ఉత్తీర్ణుడౌతూ, వార్షికోత్సవాల్లో బహుమతులన్నీ వాడే దోపిడీ చేసేవాడు. వీధిలో ఈ చివరి నుంచీ ఆ చివరి వరకూ కాపురమున్న గృహస్థులందరూ అవరేజి తెలివితేటలు గలిగిన తమ తమ కుర్రవాళ్ళని మందలించడానికి వీలుగా ప్రకాశాన్ని ఒక ఆదర్శంగా ఉదహరించేవారు. ఐతే సాంబయ్యగారు మాత్రం ప్రకాశం తెచ్చుకున్న బహుమతులకన్నింటికీ బజారు రేటులో విలువకట్టి "ఫరవాలేదు! మా వాడు గూడా కొంతవరకూ సంపాదనాపరుడౌతున్నాడు" అంటూ సంతోషించేవారు.

ప్రకాశంది అదొక రకమైన మనస్తత్వం. పది మందితో కలిసిమెలిసి తిరగవలసివస్తే వాడి ప్రాణం ఇబ్బందిలో పడిపోయేది. వాడు తన చుట్టూరా ఏర్పరచుకున్న ఒంటరితనాన్ని చీల్చుకుని నే నొక్కణ్ణి మాత్రం కొంత దగ్గరగా పోగలిగేవాణ్ణి. అందుకు ప్రకాశం నాకు సహ పాఠకుడు గావడమొకటే కారణంగాదు. మా ఇంటికి నాలుగో ఇల్లే సాంబయ్యగారిది. పైగా, వారికీ మాకూ ఏదో దూరపు బంధుత్వం గూడా కద్దు. పువ్వుతో కలిసిన దారానికిగూడా సుగంధం అబ్బినట్టు ప్రకాశంతో చేరితే నా చదువు బాగుపడవచ్చునని మా నాన్నగారి నమ్మకం. ఆ నమ్మకాన్ని పురస్కరించుకుని సాంబయ్యగారి ఇంట్లో నేను నా ఇచ్ఛవచ్చిన పద్ధతిలో ప్రొద్దుపుచ్చడానికి అవకాశం చిక్కేది. సాంబయ్యగారు రాత్రి ఏ ఎనిమిది, తొమ్మిది గంటలకో ఇంటికొచ్చేవారు. మేడ మెట్లెక్కబోతూ, గదిలో మేమిద్దరమూ

కనిపిస్తే, "ఏం చేస్తున్నార్రా మీరు?" అంటూ హెచ్చరించేవారు. "మరేం లేదు బాబాయ్! కలిసి కంబైండ్ స్టడీ చేస్తున్నాము" అని బదులు చెప్పేవాణ్ణి నేను. "మీ ఏడు పేమిటో ఏడ్చుకోండిగానీ వేడికి గ్లాసు పగిలిపోకుండా ఆ దీపం కాస్తా తగ్గించండి" అంటూ సాంబయ్యగారు మెట్లెక్కి మేడపైకి వెళ్ళిపోయేవారు.

"కంబైండ్ స్టడీ" అనే ఇంగ్లీషు మాటకు సరైన అర్థంవచ్చే తెలుగు మాట యేదోగానీ, మా విద్యార్థుల పరిభాషలో అది వట్టి బాతాఖానీ తప్పితే మరేమీ కాదు. అయ్యవార్లకు ముద్దుపేర్లు పెట్టడం, సినిమాల్లోని హాస్యగాండ్ర వేళాకోళాలు మననం చేసుకోడం ఇత్యాది రసవత్తర విషయాలను వింటున్నవాడు విన్నట్టేవుండి, నవ్వుతున్నవాడు నవ్వుతున్నట్టే వుండి హఠాత్తుగా ప్రకాశం ఒకానొక పాఠ్యభాగంలోకి జొరబడిపోయేవాడు. ఉన్నట్టుండి, "ఏ సూత్రం ఆధారంగా బ్రామా ప్రెస్సు నిర్మించారు?" అనేవాడు. లేదా, "షెప్పీల్డు దేనికి ప్రసిద్ధి?" అని అడిగేవాడు. అదీ గాకపోతే, "అందరిలోన పెద్ద మహిమాన్విత రుక్మిణిగాన పూపు గోవిందుడు...." అంటూ ఓ పద్యాన్ని ప్రారంభించి గణవిభజన చేసి, యతిప్రాసలు గుర్తించి, ఏ పద్యపాదమో వ్రాయునది అని, నేను గురువేదో, లఘువేదో తెలియక కీకారణ్యంలో దారితప్పినవాడిలా కొట్టుమిట్టాడుతుండగా, వాడు నా అవస్థను కళ్ళజూస్తూ మౌనంగా కూర్చునేవాడు.

దీపం పెట్టినవాళ్ళను చల్లటివేళ తలచుకోవాలంటారు. నా విషయంలో ప్రకాశం చేసింది అంతకంటే తక్కువ పనికాదు. ఒక్కొక్క వ్యక్తి ఒక్కొక్క ప్రత్యేకమైన పని చేయడంకోసం ఈ ప్రపంచంలోకి వచ్చాడేమో ననిపిస్తుంది. తినడం, తిరగడం, మాట్లాడడంలాంటి జీవితావసరమైన పనులెన్ని చేస్తున్నా, ఆ వ్యక్తి ఆ ప్రత్యేకమైన పని చేయడానికే పుట్టి వుంటాడని చూపరులకు భాసిస్తుంది. పుస్తకాలు చదివి, విజ్ఞానాన్ని సముపార్జించడానికి పుట్టినవాడు ప్రకాశం. పరీక్షలకు కూర్చోవడం వాడికొక వినోదక్రీడ. అగ్ని పరీక్షలా ఎదురయ్యే ప్రతి సంవత్సరాంతపు పరీక్షలోనూ కడతేరి, చావుదప్పి కన్ను లొట్టబోయినట్టుగా జస్టుపాసు మార్కులతోనైనా ఓ సర్టిఫికెట్టు సంపాదించుకోకపోతే బ్రతుకు గడపడం దుర్లభమైన నాబోటి వాడికి ప్రకాశం చేసిన సహాయం మరిచిపోదగింది గాదు. బోడినెత్తికీ, బొటన వ్రేలికి ముడిపెట్టదలచుకున్నవాడికి మల్లే, చాలీ చాలని జీతం రాళ్ళతో సంసారసాగరాన్ని ఈదటానికే ఈ మానవ జన్మ లభ్యమైందని భావించినట్టయితే, నన్ను నా జీవిత లక్ష్యం వైపు చేయిపట్టుకుని నడిపించినవాడు ప్రకాశం!

అలాంటి ప్రకాశం స్కూల్ ఫైనలు పరీక్షలో కృతార్థుడయ్యాడు. ఇక కాలేజీకి వెళ్ళడమే తరువాయి. ప్రకాశం ఉన్నత విద్య నభ్యసించడానికి లౌకికమైన అడ్డంకులను ఎవ్వరూ ఊహించలేదు. కానీ ఆశ్చర్యమేమిటంటే, ప్రకాశం కాలేజీ మెట్లెక్కలేకపోయాడు. వాడి కింతవరకూ చదివిన చదువే చాలుననీ, పై చదువుల కోసం పోరాడడం వల్ల డబ్బు, కాలం వృథాగావడం మినహాగా మరొక ప్రయోజనం లేదనీ నిక్కచ్చిగా తేల్చి చెప్పేశారు సాంబయ్యగారు.

అందుకాయన ఒక కారణం గూడా పేర్కొన్నారు. మానవుడికి తెలివితేటలే ప్రధానం గానీ, చదువుగాదు. చదివినవాడికంటే చాకలాడు మేలనడం అందుకే మరి! ఆ మాటకొస్తే తనేం చదువుకున్నాడు? తనకంటే బియ్యే చదివినవాడు పొడిచేసిందేముంది? ఏమీ లేదు! నువ్వు నీకు తగిన ఉద్యోగాన్ని చూసుకోవలసింది - అన్నారాయన ప్రకాశాన్ని ఉద్దేశించి.

ప్రకాశం తండ్రిపైన తిరుగుబాటు చేస్తాడనీ, అలా తిరగబడవలసిన అవసరం ఉందని గూడా నేను భావించాను. కానీ అలాంటిదేమీ జరగలేదు. ప్రకాశం తండ్రి మాటమేరకు ఉద్యోగాల కోసం దరఖాస్తులు వేయసాగాడు. అనతికాలంలో ఓ సుమారుపాటి ప్రభుత్వోద్యోగం దొరికింది గూడా! పెట్టే, పరుపూ సర్దుకుని వెళ్ళొస్తానని చెప్పి, ప్రకాశం యాభైమైళ్ళ దూరంలో వున్న పట్టణానికి వెళ్ళిపోయాడు.

ఉద్యోగం కోసం నేనంతదూరం వెళ్ళవలసిన అవసరం లేకపోయింది. మేష్టరీ వృత్తిలో జీవితంతో రాజీపడదలచుకున్నట్టయితే, మనదేశంలో ఎక్కడివారి కక్కడే ఉద్యోగాలు దొరికే సావకాశాలున్నాయి. అసలింకా టీచర్సు ట్రెయినింగులో వుండగానే నాకు పెళ్ళయింది. ఆహ్వాన పత్రికతోబాటు జాబుగూడా వ్రాశాను. కానీ పెళ్ళికి రాలేకపోయాడు ప్రకాశం. ఇక్కడ నాకు పెళ్ళి జరుగుతున్న ముహూర్తానికి సరిగ్గా వాడు నాగపూర్ యూనివర్సిటీ ప్రాంతంలో ఎక్కడో పరీక్షలకు కూర్చోబోతున్నాడనీ, అందువల్ల పెళ్ళికి రావడం కుదరదనీ, రాకపోయినా వాడి శుభాకాంక్షలు నన్ను వెన్నంటి వుంటాయని వ్రాశాడు ప్రకాశం.

తరువాత నాలుగైదు మాసాలకు వాడా పరీక్షలో పాసైనాడన్న వర్తమానం గూడా తెలిసింది.

"చూశావా బాబాయ్! నువ్వయితే ప్రకాశాన్ని చదివించనన్నావు. కానీ వాడు తనంతటతానే ఇంటరు పాసయ్యాడు..." అన్నాను.

వేడి పెనంలో నూనె త్రుళ్ళినట్టుగా సాంబయ్యగారి ముఖంలో పుత్రోత్సాహం తొణికిసలాడింది. "అప్పుడే ఏమైందిరా సత్యం! నువ్వు చూస్తుండు. మావాడలాగే బియ్యేగూడా పాసైపోతాడు" అన్నారాయన!

తొందరపడి సాంబయ్యగారిని అపార్థం చేసుకున్నందుకు నేనప్పుడెంతో విచారించాను. కుమారుడు పెద్ద చదువులు చదువుకోడం ఈయనకు ఆనందకరమే. ఐతే, అందుకు తన చేతినుంచీ కాణీ ఖర్చు కాగూడదన్నదే ఈయనగారి కనీసపు కోరిక!

ఈ తండ్రిగారి గడుసుతనం ఇదొక పర్వతం లాంటిదైతే, ఆ కుమారుడి జీవితం అదొక నదిలా ప్రవహిస్తూ ఎదిరించి ఢీ కొనకుండా ఆ పర్వతం ఎలా వీలిస్తే అలా మలుపు తిరుగుతోంది. భగవంతుడు ప్రకాశానికి తెలివితేటలే గాకుండా తన జీవితానికి నిండుతనాన్ని, హుందాతనాన్ని చేకూర్చుకోడానికి కావలసిన నిలకడను గూడా ప్రసాదించాడు. ఒకవైపున పితృవాక్యాన్ని ఉల్లంఘించకుండా, మరొక వైపున ఆదర్శాన్ని విడనాడకుండా ప్రకాశం ముందుకు సాగిపోతున్నందుకు సాంబయ్యగారికి మల్లే నాకూ ఆనందమే కలిగింది.

సాంబయ్యగారు సిద్ధ సంకల్పులు. ఆయన చెప్పినట్టు ప్రకాశం బియ్యేపరీక్ష గూడా యిచ్చి, పట్టా పుచ్చుకోగలిగాడు. కానీ, ఆ పట్టా అంత సులభంగా అతడి చేతికి రాలేదు. అందు కతడు కాలేజిలో చేరి, రెండేళ్ళపాటు చదువుకోవలసి వచ్చింది. రూల్స్ ఒప్పవని స్థానిక విశ్వవిద్యాలయం అతణ్ణి కాలేజీలో చేర్చుకోడానికి నిరాకరించింది. నాల్గేళ్ళ ఉద్యోగ కాలంలో మిగిలించిన డబ్బును చేత బట్టుకుని, జీతం నష్టంపైన రెండేళ్ళు సెలవు మంజూరు చేయించుకుని, రెండువందల మైళ్ళ దూరం వెళ్ళి అక్కడొక కాలేజీలో చేరాడు ప్రకాశం.

ఉద్యోగి బ్రతుకుకన్నా, విద్యార్థి జీవితం సుఖ ప్రదమే! కానీ, ఎప్పుడు? కార్డుముక్కకు బదులుగా మనియార్డర్లు దూకినప్పుడు! ఈ వెసులుబాటులేని కళాశాల విద్యార్థి పరిస్థితి

చల్లటి వెన్నెల రాత్రిలో, ప్రేయసితో సమాగమం లభించక విరహవేదనతో కుమిలిపోయే ప్రేమికుడి పరిస్థితి కంటే మెరుగ్గా ఉండదు. ఉన్నదాంతో సరిపెట్టుకోవాలన్న దృఢ నిశ్చయంతో ప్రకాశం అష్టకష్టాలు పడివుంటాడని నా ఊహ! ఆ విషయం అతడి జాబుల మూలంగా చూచాయగా తెలిసివచ్చేది. అతడు చదువుకుంటున్న ప్రాంతంలో వంటచెరకు లభ్యం కాదట! వరిపొట్టుతో వంట చేస్తారట! 'ఈ భోజనాలు, ఈ శాకపాకాలు నాకు బొత్తిగా సరిపడటం లేదురా సత్యం! పట్టెడన్నమైనా లోపలికి పోవడం లేదు. ఎక్కడైనా ఓ చిన్న ఇల్లు దొరికితే స్వయంపాకం చేసుకోవాలనుకుంటున్నాను' అంటూ అతడొక ఉత్తరంలో తన సొద వెళ్ళబోసుకున్నాడు!

'అతి' సర్వత్రా వర్జింపదగిందంటారు. ఈ తండ్రిగారి లుబ్ధత్వం సంగతి జగద్విదితమే! పోనీ, ఆ కుమారుడైనా నోరు తెరిచి అడిగితే, ఈయన కాస్తా మెత్తబడేవాడేమో! ఊహు. ప్రకాశంలోని పట్టుదల ఆ పని చేయనిచ్చిందిగాదు. ఎలాగైతేనేం, కాలానికి కట్టుబడి రెండేళ్ళ అజ్ఞాతవాసం పరిపూర్తి గావించుకుని, తిరిగివచ్చి మళ్ళీ తన ఉద్యోగంలో చేరిపోయాడు ప్రకాశం.

ఓ రోజు ఉదయం సాంబయ్యగారిని కదిలించి చూచాను. "చూడుబాబాయ్! బెండకాయగానీ, బ్రహ్మచారిగానీ ముదిరిపోగూడదంటారు. ప్రకాశం నా కంటే ఒకటి రెండేళ్ళు పెద్దవాడు. పెళ్ళయి వుంటే వాడూ ఈ పాటికి బిడ్డల తండ్రై ఉండేవాడు. నేనిలా చెబుతున్నందుకు నువ్వు మరొక విధంగా భావించవద్దు! నీ కర్తవ్యం నీకు తెలియదని గాదు. కానీ ఒకసారి నీకు జ్ఞప్తికి తేవడం బాగుంటుందనీ, భావ్యమనీ..." అంటూ అర్థోక్తిలో ఆగిపోయాను.

అప్పటికి నేనేదో విడ్డూరపు సంగతి ప్రస్తావించినట్టు అత్యాశ్చర్యంగా నా వైపు చూస్తున్నారు సాంబయ్యగారు. "ఓరి నీ ఇల్లు బంగారం గానూ! ఇదేమిట్రా సత్యం! మా ప్రకాశం పెళ్ళికి నువ్వూ, నేనూ ప్రయత్నించడమేమిటి? దిగిరావాలిరా అబ్బాయ్, దిగిరావాలి. కొండమీది కోతైనా క్రిందికి దిగిరావాలి. ఏమనుకుంటున్నావో మరి! పోనీ నువ్వే చెప్పు. దేనిలో లోటు మావాడికి? రూపమా, చదువా, ఉద్యోగమా? ఏదీ, కాగడా వేసి వెదుకు చూద్దాం. ప్రకాశం లాంటివాడు ప్రకాశం ఒక్కడే! కానైతే ఒక్కషరతు. తేరకు దొరికేదిగా దీ సంబంధం! మంచిమాటలకే రాలిపోయేదిగా దీ మామిడిపండు! టంచనుగా పదివేల గట్టి నాణాలు కుమ్మరించాలి. అంతకొక రాగిపైసా తక్కువైతే, ఆ పప్పులు మన దగ్గర వుడకవు. వెళ్ళు, కావలిస్తే ఇది నా మాటగా లోకంలో టముకు వేయించు...."

నా గుండె గుభేలుమంది. సాంబయ్యగారు కులాంతరమూ, మతాంతరమూ అయిన సంబంధానికి ఒప్పుకుంటే నేను చెప్పలేనుగానీ లేకుంటే ఇంతటి భారీ పరిమాణంలో కట్నం చెల్లించుకునే శ్రీమంతులెవ్వరూ మా బంధువర్గంలో లేరు. పోగా, ప్రకాశానికి పిల్ల నివ్వబోతున్న పుణ్యాత్ముడెవడో గానీ, ఒక ఆడబిడ్డను కని పెంచిన నేరానికీ అతనికి సాంబయ్యగారు ఇంత పెద్ద జుల్మానా విధింపదలచుకోడం న్యాయం కూడా కాదు!

"అయ్యో ప్రకాశం! నీ నుదుట పెళ్ళయ్యే రాత వ్రాశాడో లేదో భగవంతుడు" అనుకుంటూ వేడిగా నిట్టూర్చాను. ఆ రోజు సాయంత్రం ప్రభాకరం నా కోసం వెదుక్కుంటూ మా యింటికి వచ్చాడు.

ప్రభాకరం సాంబయ్యగారి రెండో కుమారుడు. నిష్కర్షగా మాటాడ్డంలోనూ, నిక్కచ్చిగా వ్యవహరించడంలోనూ వీడు తండ్రిగారికన్నా నాలుగాకులు ఎక్కువగా చదివాడు. ప్రకాశానికిమల్లే పెద్దగా స్వప్రయోజకత్వం వెలిగించలేదు గానీ, వీడూ రైల్వేలో ఏదో మంచి ఉద్యోగమే చేస్తున్నాడు. కానీ ఒక విషయంలో ప్రభాకరం ప్రకాశంకంటే మెరుగు. వాడు ఏళ్ళ తరబడి స్వగ్రామం వైపు తిరిగి చూడడు. ప్రభాకరం అలా కాకుండా, ఆరు నెలల కోసారి నాలుగు రోజుల సెలవుల్లో వచ్చి బంధుమిత్రుల నందరినీ పేరు పేరునా పలకరించి పోతుంటాడు.

"ఉదయం మా నాన్నగారి ప్రసంగాన్ని నేను కూడా విన్నాను" అన్నాడు ప్రభాకరం.

"వినే వుంటావు ప్రభాకరం! బహుశా ఆ ప్రసంగం నీకు శ్రవణానందకరంగానే ఉండి వుంటుంది. ఎందుకంటే, ముప్పై నలభై యేళ్ళ వ్యాపారానుభవంతో మీ నాన్నగారు వేరుశనగ, చింతపండు, చెరకుబెల్లంలాంటి సరుకులకు మాత్రమే ధర కట్టగలడని మన మందరమూ అనుకున్నాము. ఆయన మనుషులకు గూడా వెల కట్టగల రన్నది మనకు కొత్తగా తెలిసిన విషయం! ఆయన లెక్క ప్రకారం మీ అన్నగారి కిమ్మత్తు పదివేలు... నువ్వూ ఆ అన్నకు తమ్ముడివే గనుక ఎంత లేదన్నా నీ ధర గూడా అయిదువేల దాకా పలకొచ్చు. పలకొచ్చు నేమిటి, మీ నాన్నగారు పలికిస్తారు..."

ప్రభాకరం ఒక్క విసురుతో నా కద్దు తగిలాడు. "చాలించవయ్యా సత్యం! రక్త మాంసాలున్న మనిషే అయినా రాయిలా, రప్పలా పడివున్నాడు గనుక ప్రకాశం అన్నయ్యను కావలిస్తే మా నాన్న ఏమైనా చేసుకోవచ్చు. కానీ మన సంగతి వేరు..."

"అబ్బో, కూత ఘనంగా వుందిరా ప్రభాకరం! ఈ పరిస్థితిలో నువ్వయితే ఏం చేసేవాడి వేమిటి?"

"ఏం చేస్తానా! చెప్పిచేయడంలో స్వారస్యమేముంది? నేను చేసేదేమిటో చెప్పకుండానే చేస్తాను" అన్నాడు ప్రభాకరం.

అన్నంతపనీ చేశాడు ప్రభాకరం. మూడు మాసాల తర్వాత ఒకనాటి శుభోదయాన అతడు తపాలాశాఖవారి సౌజన్యంతో తన వివాహమహోత్సవానికి ఆహ్వాన పత్రికలు పంచిపెట్టేదాకా అతడు చేయబోతున్న పనేమిటో నాకు తెలిసింది గాదు.

పత్రికలు కళ్ళబడగానే ఇంటి కొకరిద్దరు చొప్పున సాంబయ్యగారిని పరామర్శించ దానికి వెళ్ళొచ్చారు. కానీ పుణ్యానికి పోగా, పాపం ఎదురైనట్టు "ఎందుకొచ్చారు? వెళ్ళండి. ఇక్కడెవరూ పట్టరానంత దుఃఖంతో తల్లడిల్లిపోవడంలేదు. ఎక్కడో ఎవడో ఏమిటో చేశాడని, అందుకోసం విచారిస్తూ కూచోడం నా పనిగాదు. ఈ క్షణాన్నుంచీ నాకు ముగ్గురే కొడుకులనుకుంటాను. నా ఆస్తిని మూడంటే మూడే విభాగాలు చేస్తాను. ఈ మాట దప్పితే నన్ను సాంబయ్యా అని పిలవకండి; చచ్చుదద్దమ్మ అని పిలవండి...." అంటూ సాంబయ్యగారు వెళ్ళిన వాళ్ళపైన విరుచుకపడ్డాడు.

ఈ సంఘటన జరిగిన క్రొత్తలో నే నొకసారి ప్రకాశం ఉద్యోగం చేస్తున్న పట్టణానికి వెళ్ళడం తటస్థించింది. చేస్తున్నది పెద్ద ఉద్యోగమే అయినా గాలి వెల్తురూ బాహాటంగా సంచరించడానికి వెనుకాడే ఓ చిన్నగదిలో నివసిస్తున్నాడు ప్రకాశం. ఆ గదిలో ఏ వస్తువుగానీ అది ఉండవలసినచోట కనిపించడం లేదు. ఓమూల పుస్తకాలరాసి ప్రోగుపడివుంది. మరోమూల దినపత్రికలు చిన్న గుట్టలా పడివున్నాయి. అరిగిపోయిన పాదరక్షలు గదిలో ఎక్కడంటే అక్కడ ప్రత్యక్షమౌతున్నాయి. ఇన్నింటికి మధ్య పరిచిన

పరుపు పరిచినట్టే వుంది. రోజుకొకసారి ప్రకాశం దాన్ని దులిపి వేసుకుంటున్న సూచనలు గూడా లేవు.

"ఇనుపగజ్జెల తల్లికి వరపుత్రుడిలా వున్నావురా బాబూ! ఐనా నీకిదేం గ్రహచారంరా ప్రకాశం?" అంటూ వాపోయాను.

సుఖదుఃఖాలకు అతీతుడైన మహాయోగిలా నవ్వాడు ప్రకాశం. "ఏం చేయమంటావు సత్యం! నే నెన్నుకున్న జీవితపథం అలాంటిది...." అన్నాడు.

"నీ ఆదర్శాల సంగతి నాతో చెప్పొద్దురా ప్రకాశం! త్రాగలేక పాలు బోర్లపోసుకుంటున్నానని చెబితే నే నొప్పుకుంటాను. కాకపోతే ఇదేమిటి? కదిలీ మెదలకుండా చిన్నగుంతలో నిలిచిన మురికినీటిలా స్తబ్ధమైపోయిన నీ బ్రతుకును చూస్తుంటే నాకు ఏడుపొస్తోంది. ఇప్పుడు జరుగుతున్న క్షణం మరుక్షణానికి మనదిగాదు. ఒకటికాలే దొకటి పోలేదుగానీ, నీ కప్పుడే ముప్ఫైయేళ్ళు గడచిపోయాయి. బయట వెన్నెల కాస్తుండగా. చీకటి కొట్టులో కూర్చుని కాలహరణం చేసినవాడికి, మళ్ళీ వాడు రమ్మన్నప్పుడు వెన్నెల రాదు. ప్రభాకరం నీకంటే చిన్నవాడు. వాడిని చూచైనా నువ్వు బుద్ధి తెచ్చుకోవలసింది. నువ్వు మీ నాన్నగారి మాట లేందే పెళ్ళిచేసుకోవు. ఆయన పెద్దమూట చేతికి రాందే నువ్వు పీటల పైన కూర్చోడానికి ఒప్పుకోడు. ఆయనకు పిచ్చీ కుదరదు, నీకు పెళ్ళీకాదు..."

"ఎందుకూ! మా నాన్నగారికి పిచ్చికుదరడంతోబాటు నాకు పెళ్ళికావడానికి మధ్యే మార్గం ఒకటుందిరా సత్యం!" అన్నాడు ప్రకాశం.

"ఏమిటది?" విస్తుపోతూ అడిగాను.

"మాటవరుసకి పదివేలంటున్నారు గానీ, మా నాన్నగారు అయిదువేలకు ఒప్పుకోగలరని నా నమ్మకం."

"ఐతేమాత్రం కన్ను పొడుచుకోడానికి ఏ వేలైతేనేం ప్రకాశం! ఐదువేలు మాత్రం కష్టం గాకపోతుందేమిటి?"

"అబ్బే చెబుతుంటే పూర్తిగా వినిపించుకోవురా నువ్వు. మళ్ళీ ఇందులోనూ ఓ కిటుకుంది. ఇప్పుడు నా నెలసరి జీతం రెండువందల రూపాయలు. అందులో నా ఖర్చులకు యాభై, అరవై రూపాయలు పోనూ మిగిలిన డబ్బు బ్యాంకులో వేస్తున్నాను. రెండు మూడేళ్ళలో ఆ బ్యాంకు అకౌంటు అయిదువేల దాకా ప్రాకొచ్చు..."

నేను నిర్ఘాంతపోయినమాట వాస్తవం. తండ్రి అభిమతానికి, తన జీవితానికీ మధ్య కత్తి వాదరలాంటి ఆదర్శంపైన నడుస్తున్న ప్రకాశాన్ని మందలించినందుకు నేను కించపడ్డాను గూడా! జీవితంలో చెప్పుకోదగిన సత్కార్యం ఒక్కటైనా చేసి ఎరుగని నేను ఆత్మవిశ్వాసంతో, ఆత్మనిగ్రహంతో జీవితాన్ని అదొక వ్రతంలా గడుపుతున్న ప్రకాశాన్ని సరిదిద్ద బూనడం హాస్యాస్పదం!

ఆరోజు రాత్రి హోటల్లో భోజనం చేసి సినిమాకు వెళ్ళి తిరిగొచ్చేసరికి ఒంటిగంట దాటింది. ఆ తరువాతైనా నిద్రపట్టిందిగాదు. ప్రకాశం తన ఆఫీసుగొడవలేవో చెప్పుకపోతున్నాడు. అతడెంత ఉత్సాహంగా చెబుతున్నా నాకు వాటి పట్ల ఆసక్తి జనియించడం లేదు. కానీ, అంతలో నల్లటి మబ్బుల్లో ఒక మెరుపు తృళ్ళింత లిడినట్టు నిస్సారమైన ఆఫీసు విషయాల మధ్య ఓ అమ్మాయిని గురించిన ప్రసక్తి వచ్చింది.

"టైపిస్టుగా పనిచేస్తోందిరా సత్యం! పేరు నీరజ, రెండేళ్ళయింది ఉద్యోగంలో చేరి. పదిగంటలకు సరిగ్గా ఆఫీసుకొస్తుంది. కుర్చీలో కూర్చుంటే తనేమో తన పనేమో అటూ ఇటూ చూడదు. పల్లు పలకరించడమే బ్రహ్మాండం. పెద్దవాళ్ళతో మాట్లాడవలసి వచ్చినప్పుడు ఎంత వినయంగా మాట్లాడుతుందని...."

మావాడి పొగడ్త శృతిమీరి పోతున్నందుకు నాకు నవ్వొచ్చింది. "మంచిదేరా ప్రకాశం! కానీ ఆ వినయం కాస్తా అతి వినయం కాకుండా ఉండాలి....." అన్నాను.

ప్రకాశం తటాలున నాపైన చేయివేసి, "దయచేసి, ఆమెను గురించి తేలికగా మాటాడొద్దురా సత్యం!" అన్నాడు.

ఆ హెచ్చరిక తాకిడికి నా గుండె కాసేపు పనిచేయడం మానేసింది.

యథాలాపంగా ఓ మాట అనేశాను గానీ, వీడిలా ఆమెను వెనకేసుకొస్తాడని నాకేం తెలుసు! ప్రకాశం లాంటివాడు ఆమెపైన ఈగ వ్రాలడానికైనా ఒప్పుకోడంలేదంటే, అందుకొక కారణం ఉండితీరాలి. ఇది ప్రేమజబ్బు తాలూకు ప్రాథమిక లక్షణమే గావచ్చు. అమ్మో! ఈ పిల్లి ఆ పాలు త్రాగుతుందా అనుకున్నాను. మానవ సహజమైన ధూర్త బుద్ధి ఎక్కడికి పోతుంది?

ప్రకాశం పైకిలేచి లైట్ వేశాడు. పెట్టె తెరిచి అందులోని పుస్తకంలో నుంచి ఓ ఫోటో పైకి తీస్తూ, "ఈవిడే నీరజ" అన్నాడు.

సన్నగా పొడుగ్గా సాదాగా వుంది నీరజ! చెప్పుకోదగ్గ ప్రత్యేకాకర్షణ ఏదీ ఆమెలో కనిపించడం లేదు. కానీ ఆమె అందంగా లేదని చెప్పడానికి మాత్రం వీల్లేదు. ప్రేమ గుడ్డిది గనుక ఆ వున్న కొద్దిపాటి అందం ప్రకాశం కళ్ళకు త్రిగుణీకృతంగా కనిపించిందేమో నాకు తెలియదు.

ప్రకాశం చెబుతున్నాడు. "నీరజకు తల్లిదండ్రులున్నారు. పెళ్ళికావలసిన అక్కయ్య వుంది. ఆ ముగ్గురి జీవికకు నీరజ సంపాదనే ఆధారం. ఆ అక్కగారికి గూడా ఏదో అయిన సంబంధం వుందంటున్నారు. బహుశా ఈ సంవత్సరమో, కాక పై సంవత్సరమో ఆమెకు పెళ్ళి జరిగిపోవచ్చు...."

ఆపాటికి ప్రకాశం తండ్రిగారి కోసం అయిదువేల రూపాయల నిధిని సేకరించడం గూడా పూర్తిగావచ్చు. దేవుడి దయవల్ల అనుకోని అవాంతరా లేవీ తటస్థించకపోతే, అంతటితో ప్రకాశం నీరజను చేపట్టి ఒక యింటివాడు కావచ్చు. చదువుకోడానికి వేసుకున్నట్టే ప్రకాశం పెళ్ళిచేసుకోడానికి గూడా వేసుకున్న ఈ పంచవర్ష ప్రణాళికకు విజయం చేకూరాలని నేనాక్షణాన హృదయపూర్వకంగా వాంఛించాను.

* * *

హఠాత్తుగా పిలుపువచ్చింది ప్రకాశం దగ్గరినుంచీ! "తక్షణం బయలుదేరి రావలెను. ఇలా నేను రమ్మని కబురుపెట్టిన వార్త మా నాన్నగారికి తెలియనివ్వొద్దు. వివరాలు నేరులో" అంటూ ముక్తసరిగా మూడు వాక్యాలు వ్రాసి పోస్టు చేశాడు ప్రకాశం.

స్కూలుకు సెలవుపెట్టి ఆ రోజు మధ్యాహ్నం రైలుకే బయలుదేరాను.

రైలు దిగేసరికి ప్లాట్‌ఫారం పైన్నే ఎదురయ్యాడు ప్రకాశం. చిరునవ్వుతో స్వాగతమిచ్చాడు. ఇద్దరమూ దగ్గర్లోవున్న పార్కులోకి వెళ్ళి కూర్చున్నాము. ఒకింతసేపు కుశలప్రశ్నలు గుప్పించిన తర్వాత ప్రకాశం అసలు విషయంలోకి వస్తూ "సంగతేమిటో చెప్పమంటావా సత్యం! వెయ్యి మాటలతో విసుగెత్తించడమెందుకు! ఒక్క మాటలో చెప్పాలంటే, నేను వ్రతభ్రష్టుడినైపోయాను..." అన్నాడు.

"అదేమిటి ప్రకాశం! ఏం జరిగింది?" తెల్లబోతూ ప్రశ్నించాను.

"నీరజకు అక్కయ్య వుందని చెప్పానుగదూ! ఆమెను మేనత్త కుమారుడి కివ్వడమన్న నిర్ణయం ఏనాడో జరిగింది. కాని తీరా సమయం వచ్చేసరికి వాళ్ళు గూడా కట్నంపైన మోజుపడ్డారు. కోరిన కట్నం ఇచ్చుకోకపోతే ఆమెకు ఆ పెళ్ళి తప్పిపోయేటట్టే తోచింది. అప్పుగానేననుకో – బ్యాంకులో వున్న డబ్బును తీసి నీరజ తండ్రికి ఇచ్చుకోవలసి వచ్చింది."

"ఐతే, నీ పెళ్ళి కాలనిర్ణయం లేకుండా వాయిదాపడిపోయిందన్న మాట..." నేను హతాశుడినై పోయాను.

"పడిపోయేదే! కాని ఒక్కొక్కప్పుడు పిరికివాడు గూడా మహాధైర్యశాలి కావడం కద్దు. నా విషయంలోనూ అంతే జరిగింది. నే నాదినుంచీ వరకట్నాలను వ్యతిరేకించాను. అందువల్ల స్వప్రయోజనాలకోసం ఒకానొక వరుడికి కట్నం ఇచ్చుకోవడంలో తోడ్ప ్క బలహీనత నా అంతరాత్మను బాధిస్తోంది. ఇది నామొదటి ఓటమి. రెండో ఓటమి మ నాన్నగారి మాటకు కట్టుబడి వుండలేకపోవడం. ఉందామన్నా నాలో ఓపిక నశించిపోయింది. చివరకు ఒకటి రెండు జీవితాల్లోకి వసంతాన్ని తేగలిగానన్న సంతృప్తి ఒక్కటి మాత్రం దక్కింది నాకు! ఈ సంతృప్తిని జమగా భావించి జీవితం పద్దులో నా ఆదర్శాల నన్నింటినీ ఖర్చుగా రాసేస్తున్నాను. అందుకనే నిన్నూ, ప్రభాకరాన్ని రమ్మన్ని జాబులు వ్రాశాను. రేపీపాటికి నాకూ, నీరజకూ పెళ్ళి జరిగిపోతుంది. – రిజిస్ట్రారు సమక్షంలో!"

"నువ్వు చేసింది తప్పో, ఒప్పో నాకు తెలియదు ప్రకాశం! కానీ నీకు భగవంతుడు మేలు చేస్తాడు..." ఈ మాటలు నేను బయటికి చెప్పలేదు. మనసులో అనుకున్నాను.

ఈసారి సాంబయ్యగారు తమ నినాదాన్ని కొద్దిగా సవరించుకుని, "నా కిద్దరు కొడుకులే ననుకుంటాను పో"మ్మన్నారు. అంతటితో ఊరుకున్నారుగాదు, తన ఆస్తిని రెండంటే రెండు విభాగాలు చేయబోతున్నాననీ, ఆ విభాగాల్లో ఒక భాగం చంద్రానికీ, మరొక భాగం రామానికి ఇవ్వడం జరుగుతుందనీ, ఆ మాట గనుక తప్పితే, తననందరూ శుద్ధ వాజమ్మ అని పిలవవలసిందని గూడా చెప్పాడు.

నా మట్టుకు నాకు ఒకటే సందేహం. సాంబయ్యగారు ఆ ఇద్దరు కుమారుల కైనా సకాలంలో పెళ్ళిచేయగలరన్న నమ్మకమేమీ లేదు. ఈ లెక్కన ఆయన ఒకనాటికి ఆ ఇద్దరు కొడుకుల్ని గూడా తమ జాబితాలో నుంచీ తొలగించే ప్రమాదం ఉంది. ఇప్పుడిక ఈయన తన ఆస్తినంతా ఏం చేసి వెళ్తారు? రోమన్ సామ్రాజ్య నిర్మాత జూలియస్ సీజర్ బిడ్డలు లేకుండా చనిపోతూ, తన ఆస్తిపాస్తుల్ని రోమునగర పౌరుల కందరికీ పంచిపెట్టమన్నాడని చెబుతారు. సరిగ్గా అదేవిధంగా సాంబయ్యగారు తమ ఆస్తిని, బుద్ధిగా తల్లిదండ్రుల మాటవిని పిల్లనిచ్చే మామగారి దగ్గరనుంచీ నిర్దాక్షిణ్యంగా కట్నాలు వసూలు చేసుకునే పెళ్ళికొడుకులకు తలా ఒక రూపాయ చొప్పున పంచిపెట్టవలసిందని విల్లు వ్రాసి, ఆ తరువాత నిశ్చింతగా కళ్ళు మూస్తాడేమో! చేసినా, అంతపని చేయగలిగినవారే సాంబయ్యగారు!

♦ ఆంధ్ర సచిత్ర వారపత్రిక - 1962 ♦